## క్లుప్తంగా

### పూతలపట్టులో ఫలితాలు ఇలా..

కాణిపాకం: పూతలపట్టు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ గెలుపొందారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1,95,018 ఓట్లు పోలయ్యాయి. ఇందులో టీడీపీ అభ్యర్థి 1,02,137ఓట్లు వచ్చాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌కు 86,503 ఓట్లు పడ్డాయి. కాణిపాకం నాగేశ్వర (బీఎస్పీ)కి 755 ఓట్లు, ఎం.ఎస్‌బాబు (కాంగ్రెస్)కు 2,820 ఓట్లు, విశ్వనాథ్‌సాయి మోహన్ (అఖిల భారతీయ జన్‌సంఘ్)కు 340 ఓట్లు, ఎస్.ఆర్ నవీన్ (ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్) పార్టీకి 276 ఓట్లు, హరిప్రసాద్ (భారత చైతన్య యువ జన పార్టీ)కి 143 ఓట్లు, ప్రవీణ్‌కుమార్ (స్వతంత్ర్య అభ్యర్థి)కి 130 ఓట్లు, విజయభాస్కర్ (స్వతంత్ర్య అభ్యర్థి)కి 139 ఓట్లు, ఆర్ రాజా (స్వతంత్ర్య అభ్యర్థి)కి 148 ఓట్లు రాగా.. నోటాకు 1,420 ఓట్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

### చల్లంగా చూడు గంగమ్మ తల్లీ

తవణంపల్లె: మండలంలోని దిగువ మోదలపల్లెలో మంగళవారం గంగ జాతరను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యమ్మ తల్లికి అభిషేకం, పూజలు చేసి, చల్లంగా చూడు గంగమ్మ తల్లీ అంటూ అంబలి పోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆరివేణి గంగమ్మ తల్లికి పొంగళ్లి పెట్టి మొక్కులు తీర్చుకొన్నారు. రాత్రి అమ్మ వారిని ప్రతిష్టించి పురవీధుల్లో ఊరేగించారు.

### ఘనంగా నిమ్మాలమ్మ తిరునాళ్ల



పుష్పపల్లకీలో వేంకటేశ్వరస్వామి, అమ్మవారి చిత్రపటాల ఊరేగింపు

పాలసముద్రం: మండలంలోని బాలక్రిష్టాపురం పంచాయతీ రామకృష్ణాపురం కొత్తఇండ్లు గ్రామంలో నిమ్మాలమ్మ తిరునాళ్ల మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి వేదపండితులచే కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారిని వివిధ సుగంధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు చేశారు. సాయంత్రం వేంకటేశ్వరస్వామి వారి చిత్రపటాన్ని పుష్పపల్లకీలో సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా చక్కభజన బృందం, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

### పెంచలకోనలో భారీ వర్షం



పెంచలకోనలో కురుస్తున్న వర్షం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ప్రజలు ఉదయం నుంచి ఎండవేడిమి, ఉక్కపోతతో అల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు కలిగి గాలి, వాన, ఉరుములతో భారీ వర్షం కురిసింది. రాపూరు తదితర గ్రామాల్లో చల్లని గాలులు వీయడంతోపాటు చిరుజల్లులు కురిశాయి. వాతావరణ చల్లపడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

# చిత్తూరు సీటు టీడీపీ కైవసం

- ఎమ్మెల్యేగా గురజాల జగన్‌మోహన్ గెలుపు
- టీడీపీకి 88,066.. వైఎస్సార్‌సీపీకి 73,462 ఓట్లు
- 14,604 ఓట్ల మెజారిటీ సాధించిన టీడీపీ అభ్యర్థి




జీజేఎం తరపున డిక్లరేషన్ అందుకుంటున్న టీడీపీ నేతలు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో చిత్తూరు అసెంబ్లీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ గెలుచుకుంది. టీడీపీ నుంచి పోటీ చేసిన గురజాల జగన్మోహన్‌నాయుడు (జీజేఎం) 88,066 ఓట్లు సాధించి 14,604 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంసి.విజయానందరెడ్డికి 72,399 ఓట్లు పోలయ్యాయి. మంగళవారం చిత్తూరులోని ఎస్వీ–సెట్ కళాశాలలో జరిగిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఫలితాలు వెలువరించారు. కాగా జీజేఎం తరపున టీడీపీ నేతలు దొరబాబు, చంద్రప్రకాష్ డిక్లరేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు చేతులమీదుగా అందుకున్నారు.

**మొదటి నుంచి ఆధిక్యం..**

చిత్తూరు అసెంబ్లీ స్థానానికి జరిగిన ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థి జీజేఎం తొలి నుంచి ఆధిక్యం ప్రదర్శించారు. నియోజకవర్గంలో మొత్తం ఈవీఎంల ద్వారా 1,64,260 ఓట్లు పోలయ్యాయి. వీటిని లెక్కించడానికి మొత్తం 17 రౌండ్లను ఏర్పాటు చేశారు. తొలిరౌండ్‌లో 1,344 ఓట్ల మెజారిటీ కైవసం చేసుకున్న టీడీపీ అభ్యర్థి.. ఆపై ప్రతి రౌండ్‌లోనూ పైచేయి సాధించారు. చివరి రౌండ్ పూర్తయ్యేసరికి 13,335 ఓట్ల మెజారిటీ సాధించారు. ఇక పోస్టల్‌బ్యాలెట్‌లో చెల్లుబాటు అయిన 3,529 ఓట్లలో టీడీపీకి 2,332, వైఎస్సార్‌సీపీకి 1,063 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా టీడీపీ అభ్యర్థికి 88 వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి.

**తొలి పోటీలో గెలుపు..**

గురజాల జగన్‌మోహన్‌నాయుడు రాజకీయాలకు కొత్త. ఆర్నెళ్ల క్రితం చిత్తూరు రాజకీయ చిత్రపటంలో ఓ పరిచయంలేని వ్యక్తిగా వచ్చిన జీజేఎం.. అప్పటి వరకు ఇక్కడి టీడీపీలో ఉన్న అసమ్మతిని ఒక్క తాటిపైకి తీసుకురావడంలో విజయం సాధించారనే చెప్పొచ్చు. అప్పటి వరకు టీడీపీలో టికెట్ కోసం మాజీ మేయర్ హేమలత, డీకే ఆదికేశవులునాయుడు కుటుంబం, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ముమ్మరంగా ప్రయత్నించారు. ఆర్థికంగా బలమైన నేతగా జీజేఎంను టికెట్ వరించింది. గత అయిదేళ్లుగా సేవా కార్యక్రమాలతో చిత్తూరు వాసులకు దగ్గరైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డికి పోటీగా జీజేఎం బరిలోకిదిగి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పోటీ చేసిన తొలి ఎన్నికల్లో విజయం సాధించి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.

**ఇచ్చిన హామీలు నెరవేరుస్తాం..**

చిత్తూరు వాసులకు ఏవైతే హామీలు ఇచ్చామో వాటిని నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నాం. చిత్తూరు అభివృద్ధిని నా వంతు కృషి చేస్తా

–గురజాల జగన్‌మోహన్‌నాయుడు

**ఎవరికి ఎన్ని పడ్డాయంటే..**

| అభ్యర్థి పేరు | పార్టీ | పోలైన ఓట్లు (పోస్టల్ బ్యాలెట్) |
|---|---|---|
| జగన్‌మోహన్ నాయుడు | టీడీపీ | 88,066 |
| విజయానందరెడ్డి | వైఎస్సార్‌సీపీ | 73,462 |
| టికారామ్ | కాంగ్రెస్ | 3,264 |
| లోకనాథం | బీఎస్పీ | 621 |
| రమణారెడ్డి | జనసంఘ్ | 221 |
| రవి | జైభీమ్ | 85 |
| సరిత | సమాజ్‌వాది | 50 |
| అన్వేష్ | స్వతంత్ర | 82 |
| విజయ్‌కుమార్ | స్వతంత్ర | 64 |
| తేజేష్ | స్వతంత్ర | 212 |
| పురుషోత్తం | స్వతంత్ర | 120 |
| ప్రభాకర్‌రెడ్డి | స్వతంత్ర | 62 |
| రియాజ్‌బాషా | స్వతంత్ర | 404 |
| నోటా | - | 1,096 |
| మొత్తం | - | 1,67,789 |

## సురుటుపల్లెలో వైభవంగా ప్రదోష పూజలు



నందీశ్వరునికి విశేష హారతి

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధ శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రదోష పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి సర్వమంగళ సమేత పళ్లికొండేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ప్రదోష సమయంలో ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ ఆధ్వర్యంలో నందీశ్వరుడికి, వాల్మీకేశ్వరుడికి ఏక కాలంలో అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈ ప్రదోష పూజల ఉత్తుకోట్టైకి చెందిన గణేశన్ ఉభదారుగా వ్యవహరించారు. ఆలయ కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

### కండలేరులో 6.602 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### జోరు వాన

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో మంగళవారం జోరువాన కురిసింది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతాల్లోం ప్రారంభమైన వర్షం గంటపాటు నిలకడ లేకుండా కురిసింది. దీంతో రోడ్లంతా జలమయంగా మారాయి. కాలువల్లో వర్షపు నీరు దొర్లాయి. ఇక వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది.

### జూలైలో పరాశరేశ్వర బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: నారాయణవనంలో టీటీడీ అనుబంధ శ్రీచంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై నాలుగో తేదీ తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. జూలై మూడవ తేదీ బుధవారం సాయంత్రం అంకురార్పణ ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 10 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం7 గంటలకు వాహన సేవ ఉంటుందన్నారు. జూలై 13వ తేదీ ఉదయం త్రిశూల స్నానం, రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలు పూర్తవుతాయని ఈ సందర్భంగా నాగరాజు పేర్కొన్నారు.

# ప్రమాదకరంగా బావి



జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న బావి

పాలసముద్రం: మండలంలోని రాచపాళెం గ్రామ సమీపంలో బలిజకండ్రిగ–చిత్తూరు జాతీయ రహదారి పక్కన ఓ బావి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు అదుపు తప్పితే అదోగతేనని ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్డు పక్కన ఉన్న బావికి ప్రహరీ లేదు. నిత్యం రోడ్డుపై సుమారు బస్సులు వెళ్తోంది. వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ప్రభుత్వ కళాశాలలకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఇటుగా విద్యార్థులు వెళ్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రాచపాళెం గ్రామస్తులు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బావికి ప్రహరీగోడ నిర్మించాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు.

## నైరుతి రాక..

# వేరుశనగ సాగుకు రైతన్నలు సిద్ధం!



పొలాన్ని దున్నుతున్న రైతన్న

- సబ్సిడీ విత్తనాలు పొందిన రైతన్నలు
- వర్షాల రాకతో వేరుశనగ దుక్కులకు సిద్ధం

కాణిపాకం: జిల్లాలోనే వేరుశనగ సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతం వ్యవసాయశాఖ డివిజన్. ఇక్కడ మెట్ట భూములు ఎక్కువగా ఉండడంతో యాదమరి వర్షాధారంపై పంటలు సాగు చేస్తుంటారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగను ఎక్కువగా సాగు చేస్తుంటారు.నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు దుక్కులు దున్నకాలకు పూనుకుంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వ సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులు పొందారు. ఈ వర్షాల మూలాన రైతులు అదునులో విత్తనాలేసేందుకు అవకాశం లభించింది. దీంతో పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

**సలహాలు–సూచనలు పాటిస్తే మంచి దిగుబడి..**

వేరుశనగ పంట సాగు విషయంలో రైతులు తమ సలహాలు–సూచనలు పాటిస్తే మంచి పంట దిగుబడి వచ్చి లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

- జూన్ నెలాఖరు నుంచి జూలై 15 వరకు విత్తనాలను వేసుకునేందుకు అదును
- ఎకరాకు 50 కిలోల విత్తనాలను మాత్రమే వేసుకోవాలి.
- సరైన విత్తన మోతాదుతో మొక్కకు–మొక్క మధ్య దూరం ఉంటే మంచి దిగుబడి వస్తుంది.
- కిలో వేరుశనగ విత్తనాలకు 4గ్రాముల ట్రైకోడర్మావిరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- దీంతో మొదలుకుళ్లు, కాండం కుళ్లు, వేరు కుళ్లను అరికట్టవచ్చు.
- సాలు–సాలుకు మధ్య 30 సెంటీమీటర్లు, మొక్కకు, మొక్కకు మధ్య 10 సెం.మీ దూరం ఉండేలా చూడాలి.
- విత్తనం 5 సెం,మీ లోతులోపు పడేలా చూడాలి లేకుంటే మొలక శాతం తగ్గుతుంది.
- ఈ ప్రాంత భూసార పరీక్షల మేరకు ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు, 70 కిలోల సూపర్ ఫాస్పేట్, 33 కిలోల పొటాష్, 23 కిలోల యూరియాను వాడాలి.
- విత్తే సమయంలో ఎకరాకు 200 కిలోల జిప్సం వాడాలి. దీంతో వర్షాభావం నుంచి పంటను కాపాడుకోవచ్చు.
- విత్తిన 25 రోజుల లోపు గొర్రుతో అంతర పనులు చేయాలి, ఆపై ఊడలు దిగుతాయి. అంతర సేద్యం చేయకూడదు.
- అంతర పంటలుగా 7:1తో అలసంద, జొన్న, మినుము, అనప, బీన్సు మొదలైనవి సాగు చేసుకోవచ్చు.
- పొలం చుట్టూ నాలుగు వరుసలు జొన్న, సజ్జలను వేస్తే వైరస్ తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది.

## ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి ఆర్టీసీ పలు మార్గాల్లో అదనపు సర్వీసులను ఏర్పాటు చేస్తోందని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రేణిగుంట–చంద్రగిరికి 10 సర్వీసులు, గ్రామీణ ప్రాంతాలకు 27 సర్వీసులు, 30 కొత్త హైర్ బస్సులు, అరుణాచలానికి ఒక ఏసీ సర్వీస్, మధురైకి మరో ఏసీ సర్వీస్ ఈ నెలలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వేసవి నేపథ్యంలో తిరుమలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మరోవైపు అన్ని బస్టాండ్లలో తాగునీటి సౌకర్యాలతోపాటు దాతల సాయంతో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని నాలుగు జంబో కూలర్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆర్‌ఓ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. బస్టాండ్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మొత్తంగా వేసవిలో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

# వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ దాడి

- దళితుల ఇళ్లల్లోకి వెళ్లి దాడులు చేసిన అగ్రవర్ణాలు
- పలువురికి తీవ్రగాయాలు
- మోగిలివారిపల్లెలో టీడీపీ అరాచకాలు

బంగారుపాళెం: అధికారం అందలం ఎక్కక ముందే టీడీపీ కార్యకర్తల అరాచకాలు పరాకాష్టకు చేరాయి. దళితుల ఇళ్లల్లోకి దౌర్జన్యంగా వెళ్లి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. మండలంలోని మొగిలివారిపల్లెలో అగ్రవర్ణాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు మంగళవారం సాయంత్రం ఘాతుకానికి పాల్పడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు తమ పార్టీ అధికారం చేపట్టనుంది. తమను ఎదిరించేవారెవ్వరు అనే భావనతో గ్రామంలోని దళితుల ఇళ్లల్లోకి దూరి వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలపై దాడులు చేశారు. అరుణకుమార్, రాజు, హరిష్‌లతో పాటు పలువురు గాయపడ్డారు. అడ్డు వచ్చిన వారిపై దాడులు చేశారు. గాయపడిన వారిని స్థానికులు బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అరుణకుమార్ పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టీడీపీ కార్యకర్తలు దళితులపై దాడులతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఏమి జరుగుతుందో ఏమోనని మహిళలు, వృద్ధులు, పిల్లలు ఆందోళన చెందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.




టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన అరుణకుమార్, తీవ్రంగా గాయపడ్డ రాజు

### టీడీపీ దౌర్జన్యం

- భయాందోళనలో ప్రజలు

పూతలపట్టు: పూతలపట్టులో దౌర్జన్య కాండ మొదలైంది. టీడీపీ గెలుపుతో తమ్ముళ్లు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డారు. వారి ఇళ్లల్లోని వస్తువులను ధ్వంసం చేశారు. అలాగే మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని నేలమట్టం చేశారు. దీంతో పూతలపట్టు ప్రజలు భయాందోళనలో పడ్డారు. పూతలపట్టు మండలంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయారు. పలువురిని రక్తమొచ్చేలా కొట్టారు. మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద తేనేపల్లి ఉపసర్పంచ్ నందయ్యను బెదిరించారు. ఆపై దుకాణాన్ని ధ్వంసం చేశారు. అనంతరం బైకు ర్యాలీ అంటూ కర్రలతో వీరంగం సృష్టించారు. దీంతో పాటు ఎగువపాలకూరు దళితవాడలోని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై ఇళ్లపై కర్రలతో దాడి చేశారు. ఇళ్ల అద్దాలను పగులకొట్టారు. 10 మందిని తీవ్రంగా గాయపరిచారు. పాలకూరులోని దివగంతనేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని నేలమట్టం చేశారు. ఈవిషయం తెలుసుకున్న పోలీసుటు సంఘటన స్థలానికి చేరుకుని కింద పడ్డ విగ్రహాన్ని వైరుతో కట్టి నిలబెట్టారు. దీంతో పాటు వావిల్‌తోట పంచాయతీలోని నయనంపల్లి, వీర్లగుడిపల్లి, కండ్రిగలోని సానుభూతిపరుల ఇళ్లను ధ్వంసం చేశారు. ఏజెంట్‌గా పనిచేసిన హరిబాబుపై దాడి చేసి, ట్రాక్టర్‌కు నిప్పటించారు. ఈ దాడుల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు తీవ్ర గాయాలు కావడంతో పాటు రూ.లక్షల విలువ చేసే ఆస్తులు ధ్వంసమయ్యాయి. ప్రజలు భయాందోళనకు గురవుతున్నాయి. కాగా దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదని పోలీసులు చెబుతున్నారు.

**వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రహరీగోడ కూల్చివేత**

తవణంపల్లె: ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ గెలుపొందడంతో మండలంలోని తెల్లగుండ్లపల్లెలో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పనిచేశాడని మంగళవారం సాయంత్రం తెల్లగుండ్లపల్లె ఎస్టీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త కృష్ణమూర్తియాదవ్ ఇంటి ప్రహరీగోడను జేసీబీతో కూల్చివేశారు. కృష్ణమూర్తియాదవ్‌కు చెందిన జేసీబీ పట్నం సమీపంలో ప్రతాప్‌రెడ్డి మామిడి తోటలో ఉంచాడు. టీడీపీ నాయకులు పథకం ప్రకారం పట్నం సమీపంలో ప్రతాప్‌రెడ్డి మామిడి తోటలోని కృష్ణమూర్తియాదవ్ జేసీబీని తీసుకెళ్లి తెల్లగుండ్లపల్లెలో అతని ప్రహరీగోడను కూల్చివేశారు. విషయం తెలుసుకున్న తవణంపల్లె పోలీసులు తెల్లగుండ్లపల్లెకు చేరకుని దాడులను అరికట్టారు. అంతకు ముందు తెల్లగుండ్లపల్లెలోని వైఎస్సార్‌సీపీ జెండాను టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు.

# గంగమ్మకు కరెన్సీ నోట్ల అలంకరణ



కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీ అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ



గంగ జాతర వేషధారణలో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం

తిరుపతి కల్చరల్: కరుణించి కాపాడు... గంగమ్మ తల్లీ అంటూ భక్తజనం మంగళవారం సర్వాంగ సుందర అలంకరణలో కొలువైన శ్రీతాతయ్యగుంట గంగమ్మను కోరి ప్రార్థించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి ప్రార్థించారు. తిరుపతి గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మారుపొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గంగ జాతర తర్వాత వచ్చిన రెండో మంగళవారం వేకువజాము నుంచే భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చి పొంగళ్లు పెట్టడం ఆరంభించారు. పొంగళ్ల నైవేథ్యంగా అమ్మవారికి సమర్పించి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీతో శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం కిక్కిరిసింది. రెండో మంగళవారం కావడంతో ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం వివిధ కరెన్సీ నోట్లు పుష్పాలతో గంగమ్మ తల్లిని ధనలక్ష్మీ రూపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి, కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జాతరలో వేషాల మొక్కులు చెల్లించని భక్తులు మంగళవారం చిన్నాపెద్దా తేడా లేకుండా భక్తులు భక్తి శ్రద్ధలతో గంగవేషాలు ధరించి ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మొక్కుబడిలో భాగంగా భక్తులు ఆలయం వద్ద భక్తులకు అంబళ్లు పోసి, ప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఈఓ కె.మమత, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.






నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహిస్తున్న భక్తులు